# పగపట్టిన పాములు

ఆ గ్రామం ఆదర్శగ్రామం అని పేరుపడింది. అక్కడ ఎలిమెంటరీ స్కూల్ని హైస్కూలుగా మార్చి నన్ను హెడ్‌మాస్టరుగా నియమించారు. అప్పుడే ఆఊరు వెళ్ళాను. ఆ స్కూలు భవనం చూసి ఆశ్చర్యపోయాను. చాలా పెద్దది. దాని ఎదురుగా పెద్ద గ్రంథాలయం వుంది. ఆ గ్రంథాలయానికి పక్కగా చక్కటి పార్కు వుంది. ఇవన్ని చూసి ఆ ఊరిని ఎంతో మెచ్చుకున్నాను.

ఒకనాటి సాయంకాలం గ్రంథాలయం వరండాలో ఒక ముసలాయనతో విచ్చాపాటి వేస్తుంటే ఆయన అన్నాడు - "మాస్టారూ! ఇవన్నీ కొత్తవాళ్ళకి మెప్పుదలగానే వుంటాయి. కన్నులపండుగ్గా వుంటుందీ వూరు. కాని నాబోటి ముసలాడికి వీటి చరిత్ర తలుచుకుంటే గుండె చెరువవుతుంది. ఇవి ఎన్నో ప్రాణాలమీద కట్టినవి. వీటి ప్రతి అణువులోంచి భయంకర రోదన వినిపిస్తుంది." ఇది విన్నాక నాకు కుతూహలం అధికమయింది. వాటి చరిత్ర చెప్పమని ఆయన్ని బలవంతపెట్టాను. చెప్పటం యిష్టంలేకపోయినా చివరకి ఒప్పుకుని ఉపక్రమించాడు. "అంతగా అడుగుతున్నారు కాబట్టి చెప్తున్నా. నలభైయేళ్ళ నాటిమాట. అప్పటికి నాకు నలభైయేళ్లుంటాయి.....

పట్నంలో ప్లీడరీచేస్తున్న పరమేశ్వరం యీ వూళ్ళో వున్న నాల్గెకరాల కోంద్రని అమ్మకానికి పెట్టాడు తానే స్వయంగా వచ్చి. అసలీ ఊరు మోతుబర్లకి పుట్టిల్లు. పొలం రావాలేగాని డబ్బు గుమ్మరిస్తారు. మొదట్లో బేరం వీరయ్యతో నలిగింది. పరమేశ్వరం దగ్గరికి లచ్చుమయ్యను చాలాసార్లు పంపాడు వీరయ్య. వీరయ్యకి పెదకమతగాడు లచ్చుమయ్య. మాంచి పనిమంతుడు. తలపెట్టినపని అయితేగాని నిద్రపోడు. వీరయ్యకి అన్నింట్లోను కుడిభుజంగా వుంటున్నాడు. ఎలాగయితేనేం, ఎకరం పన్నెండొందలకి వచ్చింది. పొలం కాడెగట్టునే వుంది వీరయ్యకి. అతన్దే ఛాన్సనుకున్నారు అందరూ. కాని మర్నాటి వుదయానికి వూరంతా పాకిపోయింది - రంగయ్య పరమేశ్వరానికి కాంట్రాక్టుచీటి రాసిచ్చిన సంగతి. రంగయ్య మరోనూట పాతిక ఎక్కువ పెట్టాడట. పొలం బేరం పూర్తయింది. వీరయ్య చాలా విచారించాడు. వెనకటికి చెరువుగట్టుమీద మంచినీళ్ళ బావి తవ్వించటంలో రంగయ్యకి, వీరయ్యకి మాటా మాటా వచ్చినా తర్వాత తర్వాత మామూలుగానే వుంటున్నారు. ఇప్పుడుమాత్రం తనకి కలిసినచేనుకి పోటీకొచ్చి తన్నుకుపోయినందుకు వీరయ్యకి రంగయ్యమీద గుర్రుగానే వుంది. లచ్చుమయ్య కూడా తీరా యింతబేరం సాగించినా చివరకి సున్నా అయిందేమని బాధ పడ్తున్నాడు. అయితే, లచ్చుమయ్యకి ఒకందుకు

గర్వంగా వుంది. ఏమంటే, రంగయ్య కొత్త పొలానికి సరాసరి బోదె లేదు. వీరయ్య పొలంలోంచి నీరు పోవాలి. ఈ సందు అందించాడు వీరయ్యకి.

కాలవలు వదిలారు. దుక్కులు ప్రారంభమయ్యాయి. నీరు బిగించాడు వీరయ్య. గండి కొట్టనివ్వనన్నాడు. రంగయ్య స్వయంగా అడిగాడు వీరయ్యని నీరు వదలమని. తన పొలం పని అవ్వగానే వదుల్తానని అన్నాడు వీరయ్య. కాని తరుణందాటేవరకు వదల్నేలేదు. ఆ తర్వాత వదిలాడు. దీంతో రంగయ్యకి చెడ్డకోపం వచ్చింది. కాని చెయ్యగలిగింది ఏమీ కనిపించలేదు. అప్పట్నుంచి యిద్దరికీ మాటలు లేవు. ఒకరి మీదొకరికి స్పర్ధ పెరిగిపోతోంది.

రంగయ్య తన పొలాన్ని బీడు పెట్టుకుంటాడా? ఆ మరు సంవత్సరమే బోది తెప్పించుకున్నాడు. బోది మంజూరవంగానే తవ్వకం ప్రారంభించారు. తవ్వకందగ్గరే పెద్ద పేచీ వచ్చింది. లచ్చుమయ్య దగ్గరే వున్నాడు. వీరయ్య గట్టుని ఆక్రమిస్తున్నారని లచ్చుమయ్య ఉప్పర్లని పని ఆపుచేయించాడు. రంగయ్య మొదట్లో పెద్దగా దబాయించినా చివరికి అందుకు అంగీకరించాడు. రంగయ్య తిరిగిరాగానే లచ్చుమయ్య జరిగిందంతా చెప్పాడు. మండిపడ్డాడు వీరయ్య. కర్ణాన్ని పిలిచి మషాయిదీ చేయించేందుకు ఒప్పుకున్నారు. లెక్కప్రకారం వీరయ్య గట్టులోది కొంత రంగయ్య లెక్కలోకి రావాలని తేలింది. అలాగే జరిగింది. వీరయ్యకి, లచ్చుమయ్యకి తలలు కొట్టినట్లయింది.

పూర్వంవున్న కోపం యిప్పుడు పెద్ద పగగా మారింది. లచ్చుమయ్య బంధువుల కుటుంబాలన్నీ వీరయ్యకి మద్దత్తుగా వుంటున్నాయి. ఈ సంగతి చూచాయగా విన్న రంగయ్య జగన్నాథాన్ని పిలిపించాడు. రంగయ్య అంటే జగన్నాథానికి మాంచి గురి. పైగా, అడపాతడపా రంగయ్యవద్ద సాయం పొందుతూ వుంటాడు. వీరయ్య చేస్తున్న ఏర్పాట్లన్నీ విన్నాడు జగన్నాథం. తానావూళ్ళో వుండగా రంగయ్యకి చిన్నమెత్తు అపకారం జరగదని హామీ యిచ్చాడు జగన్నాథం. రంగయ్యకు గుండె నిబ్బరం చిక్కింది, జగన్నాథం వుదంతం వీరయ్యకి తెలిసింది. ఎందరు కలిస్తేమటుకు తన్నేంచేస్తారనే ఉదాసీనత్తో వున్నాడు వీరయ్య.

ఇరువురికి మనస్సుల్లో కక్షలంటే వున్నాయి. అంతేకానీ, పెద్ద అపకారం చెయ్యాలని అవతలవాణ్ణి నాశనం చెయ్యాలని ఆలోచనలేదు ఎవ్వరికియ్యాడ. అవసరమొస్తే ఆదుకునేందుకు మాత్రం యితరుల్ని చేరదీసివుంచారు. ఇద్దర్లో ఒకరుమీదకి దూకితే ప్రతీకారంగా అమాంతం మింగేసేందుకు సిద్ధంగా వున్నారు.

లోలోపల స్పర్ధలతో కాలం దొర్లిపోతోంది. వీరి పోట్లాటని వూతగా తీసుకుని స్వార్థంకోసం తంటాలు పడేవాళ్ళు వూళ్ళో చాలామంది బయలుదేరారు. అందులో కోటేశుకుటుంబం ముఖ్యమైంది. అవకాశంకోసం కాసుక్కూర్చున్నాడు కోటేశు. పంట కోతలయ్యాక కుప్పలేశారు వూళ్ళో రైతులంతా. రంగయ్యకుప్ప కూడా పూర్తయింది. ఒకనాటి రాత్రి కోటేశు మరి ముగ్గురితోవచ్చి రంగయ్య కుప్పలోంచి ఏడెనిమిది పెద్ద పెద్ద మోపులు ఇంటికి జేర్చాడు. తెల్లారిగట్ట రంగయ్య పాలేరొచ్చి కుప్పచూసి

లబోదిబోమంటూ రంగయ్య దగ్గరికి పరుగెత్తాడు. రంగయ్య కళ్ళునిప్పులు కక్కాయి. సంగతంతా తెలుసుకున్నట్టు తలూపాడు. వెంటనే జగన్నాథానికి కబురంపి అతన్తో చాలాసేపు సంప్రదించాడు. వీరయ్య తిక్కకుదిరే పనిచేస్తాను చూడమని జగన్నాథం వెళ్ళిపొయ్యాడు.

వీరయ్యయింట్లో పనంతా పూర్తయ్యాక లచ్చుమయ్య రాత్రి తొమ్మిదింటికి తనింటికి బయలుదేరాడు. అంతా నిర్జనంగా వుంది దార్లో. లచ్చుమయ్య చకచకా నడిచిపోతున్నాడు ఒక్కడే. చింతచెట్టు పక్క నుంచి జగన్నాథం అమాంతం లచ్చుమయ్య మీదికి దూకి నోట్లో కండువా కుక్కాడు. జగన్నాథం వెంటవున్నవాళ్ళు లచ్చుమయ్యని డొక్కలో పొడిచారు దిట్టంగా. ప్రాణాలుపోయాక లచ్చుమయ్య శవాన్ని పక్కనే వున్న గుంటలోకి యీడ్చుకెళ్ళి పడేసిపోయారు. పదిగంటలవరకు రాకపోవటంవల్ల లచ్చుమయ్యింట్లో వాళ్ళకి, బంధువులకి అనుమానం వేసింది. లాంతర్లు పుచ్చుకుని వీరయ్య యింటికి వచ్చారు. వీరయ్య మరీ ఖంగారుపడ్డాడు. అంతా కలిసి వీరయ్య యింటికిపోయే దారంతా గాలించారు. రక్తం ముద్దయివున్న లచ్చుమయ్య శవాన్ని చూసి లబోదిబోమన్నారు. లచ్చుమయ్య వంటిమీద కత్తిపోట్లు చూశాక అతని బంధువుల గుండెల్లో రంగయ్య కత్తితో పొడిచినట్లయింది. అందరూ పులుల్లాగా వీరయ్య వంక చూశారు ఉత్తర్వుకోసం. వీరయ్య వాళ్ళ అభిప్రాయం గ్రహించి అనుకున్నట్లే చెయ్యండని చెప్పాడు.

ఆ మర్నాడు ఉదయానే పోలీసులొచ్చి అంతా వాకబుచేసి లచ్చుమయ్య శవాన్ని బస్తీ తీసుకుపోయారు. ఆ రాత్రే లచ్చుమయ్య తాలూకు వాళ్ళు మూటాముల్లెకట్టి ఒకరు తప్ప అందరూ అయిపులేకుండా వెళ్ళిపోయారు. రాత్రి పదకొండు గంటలకి అతడు రంగయ్య యింటి దగ్గరికివచ్చాడు. నాల్గు మూలలా నిప్పటించాడు. రెండో కంటికి కనపడకుండా పారిపోయాడు. మరో పదినిమిషాలకే గప్పున మంటలు లేచాయి. ఊరంతా బిలబిలమంటూ లేచింది. మంటలు తప్పుకుని బయటకు రాలేక రంగయ్య కుటుంబం అగ్నిదేవుడికి ఆహుతయ్యింది. జనమంతాచేరి నిప్పులార్ప ప్రయత్నం చేశారు. చివరికి ఎలాగో మంటలణిగాయి. నిప్పంటుకోటానికి మనిషికొకరకంగా కారణం చెప్పుకున్నారు. తెల్లవారుఝామున మూడుగంటలకి వూరు కొంచెం సద్దుమణిగింది.

రంగయ్య కుటుంబం అంతా దిక్కులేని చావుకి గురి కావటంచూసి నిలువెల్లా నిప్పులు పోసినట్లయ్యాడు జగన్నాథం. తనవాళ్ళని వెంటతీసుకుని ఎకాయెకి లచ్చుమయ్య బంధువులుండే చోటికి వెళ్ళాడు. అక్కడ ఒక్క పురుగూ కనిపించకపోవటంతో అతని అనుమానం నిజం అయ్యింది. తనవాళ్ళల్లో ఒక్కణ్ణి యింటికి పంపి పరారీకి యేర్పాట్లు చేయించాడు. మిగిలినవాళ్ళతో కలిసి వీరయ్య యింటికి వెళ్ళాడు. గోడదూకి యింట్లో ప్రవేశించారు. మరో పావుగంట తర్వాత తలుపు తీసుకుని యివతలకొచ్చారు పగతీరిన పాముల్లాగా. అంతే. తిరిగి వారిజాడలేదు. పొద్దున్నే ఇరుగుపొరుగువాళ్ళు వీరయ్య కుటుంబం మంచాల్లోనే శవాలై

వుండటం చూసి గొల్లుమన్నారు. ఊరు ఊరంతా రంగయ్య, వీరయ్య కుటుంబాలు బలి కావటం చూసి దుఃఖంతో కుమిలిపోయింది. పోలీసులు ఏవేవో వివరాలు రాసుకుని శవాల్ని వెంటతీసుకుపోయారు.... ఇదీ మాస్టారూ, జరిగింది. వారి ఆస్తులే యివి. ఈ భవనాల రాళ్ళలోంచి వచ్చే రోదనం మీకు వినిపిస్తుంది యిక. ఎక్కడా యిలాంటి ఘోరం జరక్కూడదని యీ అరుగుమీద కూర్చుని నిత్యం ప్రార్థిస్తుంటా. ఆ ప్రార్థన వాళ్ళ ఆత్మశాంతికి" అని కళ్ళు తుడుచుకుంటూ ముగించాడు తాత.

*('కథానిక' కథాసంకలనం - 1955)*